రైతులకు ఉపయోగపడే కార్యక్రమాలు చేపట్టాలి

మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



మంత్రి తుమ్మలకు శుభాకాంక్షలు చెబుతున్న సంఘం నేతలు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ప్రభుత్వం ద్వారా రైతులకు ఉపయోగపడే విధంగా వ్యవసాయ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు అధికారులకు సూచించారు. మార్కెట్ డిమాండ్‌కు అనుగుణంగా పంటల విధానాన్ని చేపట్టి పండించిన ఉత్పత్తులను రాష్ట్రంలోనే కాకుండా ఇతర రాష్ట్రాలకు విదేశాలకు ఎగుమతి చేసే అవకాశాలను వినియోగించుకోవాలని మంత్రి వారికి సూచించారు. శనివారం తెలంగాణ వ్యవసాయ అధికారుల సంఘం చైర్మన్ బి.కృపాకర్‌రెడ్డి, అధ్యక్షులు డి.వైద్యనాథ్, ప్రధాన కార్యదర్శి జి.కృపాకర్ రెడ్డిలు మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావును ఆయన నివాసంలో కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఇటీవల సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన వ్యవసాయ అధికారుల సంఘం నూతన కార్యవర్గం సభ్యులు పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు క్షేత్రస్థాయిలో అధికారులు రైతులకు ఎల్లవేళల అందుబాటులో ఉంటూ సేవలు చేయాలని సూచించినట్లు తెలిపారు. రాష్ట్ర స్థాయిలో రూపొందించిన ప్రణాళికలను, వ్యవసాయ విశ్వవిద్యాలయం సలహాలు, సూచనలను ఎప్పటికప్పుడు జిల్లా స్థాయి వ్యవసాయ విజ్ఞాన కేంద్రాల ద్వారా రైతులను చైతన్య పరచాలని రైతులకు సూచించాలని తెలిపారన్నారు. కార్యక్రమంలో రిటైర్డ్ జాయింట్ డైరెక్టర్ వి.చంద్రమోహన్, ఇతర సభ్యులు పాల్గొన్నారు.

అంబర్‌పేట ఫ్లైఓవర్ పనుల్లో వేగం పెంచండి



ఫ్లైఓవర్ పనులను పరిశీలిస్తున్న అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, కార్పొరేటర్ పద్మా వెంకట్‌రెడ్డి

అంబర్‌పేట్ ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

అంబర్‌పేట్: నిర్మాణంలో ఉన్న అంబర్‌పేట్ ఫ్లైఓవర్ పనుల్లో మరింత వేగం పెంచాలని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అధికారులకు సూచించారు. శనివారం ఫ్లైఓవర్ పనులను బాగ్ అంబర్‌పేట డివిజన్ కార్పొరేటర్ బి.పద్మా వెంకట్‌రెడ్డి, అధికారులతో కలిసి ఎమ్మెల్యే పర్యవేక్షించారు. నిర్మాణంలో జరుగుతున్న జాప్యాన్ని నివారించాలని ఆయన ఆదేశించారు. ఫ్లైఓవర్ పనులతో స్థానికులతో పాటు ఇతర ప్రాంతాల నుంచి రాకపోకలు సాగించే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఎమ్మెల్యే కాలేరు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. నిర్మాణం జరుగుతున్న పరిసర ప్రాంతాల నివాసితులు నిత్యం అవస్థలు పడుతున్నారని పేర్కొన్నారు. ప్రణాళికాబద్ధంగా ఫ్లైఓవర్ నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. అంతేకాకుండా తలెత్తుతున్న ఇబ్బందులను నివారించేందుకు ప్రత్యామ్నాయ చర్యలపై కూడా దృష్టి సారించాలన్నారు.

నామినేటెడ్ పోస్టుల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలి

బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య



ఆర్.కృష్ణయ్యకు జ్ఞాపికను అందజేస్తున్న రాజ్‌కుమార్

కాచిగూడ: నామినేటెడ్ పోస్టుల్లో బీసీలకు 50శాతం రిజర్వేషన్లు కల్పించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బీసీ యువజన సంఘం రాష్ట్ర కన్వీనర్ టి.రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో ప్రతినిధి బృందం శనివారం ఆర్.కృష్ణయ్యను మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు. ఈ సందర్భంగా రాజ్‌కుమార్‌తో కలిసి ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్రంలో ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని నామినేట్ పదవుల్లో అధిక శాతం బీసీలకు కేటాయించాలని కోరారు. రాష్ట్రంలో బీసీ జనాభా ఎక్కువగా ఉందని ఇది పరిగణనలోకి తీసుకొని ప్రాముఖ్యత గల పదవులు బీసీ నాయకులకు కేటాయించాలన్నారు. బీసీలకు ప్రభుత్వ ప్రైవేటు సంస్థల్లో 50 శాతం రిజర్వేషన్ కల్పించాలన్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో సమర్థవంతమైన బీసీ నాయకులను ఎన్నుకొని వారికి టికెట్ కేటాయిస్తే అత్యధిక మెజార్టీతో గెలిపిస్తామని తెలిపారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాజేందర్, బండారి కుమార్ తదితరులు పాల్గొన్నారు.


సందడిగా ముషీరాబాద్ బస్‌డిపోలో వన భోజనాలు



మాట్లాడుతున్న ఈడీ వెంకటేశ్వర్లు

ముషీరాబాద్: కార్మికుల్లో ఐక్యత, స్నేహభావం, ఉత్సాహం నింపడానికి టీఎస్ ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ సజ్జనార్ ఆదేశాల మేరకు సంస్థ సిబ్బంది అందరికి వన భోజన మహోత్సవ కార్యక్రమం శనివారం ముషీరాబాద్ బస్ డిపో ప్రాంగణంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా గ్రేటర్ హైదరాబాద్ ఈడీ వెంకటేశ్వర్లు, రిజనల్ మేనేజర్ వనప్రసాద్, చార్మినార్ డిప్యూటీ రిజనల్ మేనేజర్ విజయభాను, డిప్యూటీ రిజనల్ మేనేజర్(మెకానికల్) జగన్ తదితరులు హాజరయ్యారు. కార్మికులు కష్టపడి పని చేస్తూ సంస్థ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ముషీరాబాద్ డిపో మేనేజర్ టి.కిషన్‌రావు, అసిస్టెంట్ మేనేజర్ కళ్యాణి, చందర్ తదితరులు పాల్గొన్నారు. డిప్యూటీ ఆర్ఎం విజయభాను, జగన్ తదితర అధికారులు సిబ్బందికి భోజనాలు వడ్డించి వారితో కలిసి భోజనాలు చేశారు. సిబ్బందితో మమేకం కావడానికి వన భోజన కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. అనంతరం సిబ్బందికి ఆటల పోటీలు, సంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

పేద పిల్లల విద్యకు స్వచ్ఛంద సంస్థ కృషి భేష్



సర్టిఫికెట్లు అందజేస్తున్న ప్రిన్సిపాల్ అశోక్

ముషీరాబాద్: ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేద కుటుంబాలకు చెందిన పిల్లలు చదువుకునేందుకు ఆర్‌జే ఇన్‌స్పిరేషన్ అండ్స్ సంస్థ చేస్తున్న కృషి అభినందనీయమని కృష్ణవేని టాలెంట్ స్కూల్ ప్రధాన ఉపాధ్యాయుడు అశోక్ అన్నారు. శనివారం ముషీరాబాద్ డివిజన్ గంగపుత్ర కాలనీలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో చదువుకుంటున్న పేద విద్యార్థులకు ఆర్‌జే ఇన్‌స్పిరేషన్ సంస్థ ప్రతినిధులు పిల్లల చదువుకు స్కూల్ ఫీజులు చెల్లించారు. సంస్థ ప్రతినిధులు ఉమాకార్తీక్, రాణి, రాధ, సుప్రియ, మహేశ్వరి, లక్ష్మీకుమారి తదితరులు పాల్గొన్నారు.

కొత్త డ్రైనేజీ పైప్‌లైన్లు నిర్మించాలి



డ్రైనేజీ సమస్యలను వివరిస్తున్న కార్పొరేటర్ రవిచారి

ముషీరాబాద్: రాంనగర్ డివిజన్ రిసాల కల్లుకంపౌండ్, శివస్థాన్‌పూర్, బాకారం తదితర ప్రాంతాలలో నిత్యం డ్రైనేజీ సమస్య ఉత్పన్నమవుతూ ప్రజలకు తీవ్ర అసౌకర్యాన్ని కల్పిస్తుందని రాంనగర్ డివిజన్ కార్పొరేటర్ కె.రవిచారి ఆరోపించారు. పెరిగిన జనాభాకు, అపార్ట్‌మెంట్లు, ఇళ్లకు అనుగుణంగా 40 సంవత్సరాల క్రితం ఉన్న పాత డ్రైనేజీ పైప్‌లైన్‌లు తీసేసి కొత్త డ్రైనేజీ పైప్‌లైన్‌లు వేయాలని జలమండలి మేనేజర్‌ను కోరారు. శనివారం ఈ ప్రాంతంలో అధికారులతో కలిసి పర్యటించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు శంకర్, బాలరాజ్, సాయి, వనజ తదితరులు పాల్గొన్నారు.

ఎంచుకున్న రంగాల్లో నైపుణ్యతను సాధించాలి

ఓయూ రిజిస్ట్రార్ డాక్టర్ లక్ష్మీనారాయణ



మాట్లాడుతున్న ఓయూ రిజిస్ట్రార్ డాక్టర్ లక్ష్మీనారాయణ

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ఏ రంగాన్ని ఎంచుకున్నా ఆయా రంగాల్లో నైపుణ్యాన్ని సాధిస్తే మంచి అవకాశాలను అందిపుచ్చుకోగలుగుతారని ఉస్మానియా యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ లక్ష్మీనారాయణ అన్నారు. శనివారం బాగ్‌లింగంపల్లిలోని ఆర్టీసీ కల్యాణ మండపంలో మెథడిస్ట్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ గ్రాడ్యుయేషన్ సెరమనీని ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా సుమారు 700 మంది విద్యార్థులు ఇంజినీరింగ్ గ్రాడ్యుయేషన్ పట్టాలు అందుకున్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ... ప్రస్తుత పోటీ ప్రపంచంలో తట్టుకోవాలంటే కష్టపడి చదవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రణాళికాబద్ధంగా విద్యను అభ్యసిస్తే ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారని సూచించారు. నేడు ఇంజినీరింగ్ విద్యార్థులకు దేశ విదేశాల్లో మంచి అవకాశాలు లభిస్తున్నాయని అయితే ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా కొంత మంది విద్యార్థులు ఉపాధి అవకాశాలను కూడా కోల్పోవాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. నైపుణ్యం ఉన్న విద్యార్థులకు మాత్రం అవకాశాలు మెండుగా లభిస్తున్నాయని తెలిపారు. కార్యక్రమంలో ఓయూ కంట్రోల్ ఆఫ్ ఎగ్జామినేషన్ డాక్టర్ రాములు, మెథడిస్ట్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ చైర్మన్ కె.కృష్ణారావు, డైరెక్టర్ ప్రదీప్‌రెడ్డి, పి.ప్రకాష్‌రెడ్డి, డాక్టర్ ఎం.లక్ష్మీపతిరావు, ప్రిన్సిపాల్స్ డాక్టర్ ప్రభు, జి.బెనకాప్, డాక్టర్ వై.మస్తానమ్మ, పీఆర్‌వో ఆర్.శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

కేలండర్ ఆవిష్కరణ



కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

ముషీరాబాద్: హైదరాబాద్ జిందాబాద్ పౌర సంస్థ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర కేలండర్‌ను శనివారం టూరిజం సంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా హైదరాబాద్ జిందాబాద్ సంస్థ ప్రధాన కార్యదర్శి కె.వీరయ్య, సంస్థ నిర్వహిస్తున్న కార్యక్రమాలను రాష్ట్ర మంత్రి జూపల్లికి వివరించారు. సంస్థ నగర నాయకులు జె.కె.శ్రీనివాస్, కృష్ణమోహన్, ఎం.శ్రీనివాస్‌రావు, శ్రీనివాస్, మోహన్‌నాయుడు, నాగేష్, రాజమౌళి, గోపాల్, సత్య తదితరులు పాల్గొన్నారు.

'ప్రజాపాలన'ను నిరంతరం కొనసాగించాలి

చిక్కడపల్లి: ప్రజాపాలన కార్యక్రమాలను నిరంతర ప్రక్రియ జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని గాంధీనగర్ డివిజన్ కార్పొరేటర్ ఎ.పావని వినయ్‌కుమార్ అన్నారు. శనివారం గాంధీనగర్ డివిజన్‌లోని చిక్కడపల్లి వార్డ్ ఆఫీస్ వద్ద కొనసాగుతున్న ప్రజాపాలన కేంద్రాన్ని ఆమె సందర్శించి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా పావని మాట్లాడుతూ... అర్హులైన ప్రతి ఒక్కరికీ 6 గ్యారంటీలను త్వరలోనే అందించేదుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ ప్రవీణ్‌చంద్ర, బీజేపీ నగర యువ నేత ఎ.వినయ్‌కుమార్ పాల్గొన్నారు.

హత్యాయత్నం కేసులో వ్యక్తికి రిమాండ్

ముషీరాబాద్: ఓ వ్యక్తిపై దాడి చేసి హత్య చేసేందుకు యత్నించిన వ్యక్తిని ముషీరాబాద్ పోలీసులు అరెస్టు చేసి శనివారం రిమాండ్‌కు తరలించారు. ముషీరాబాద్ ఇన్‌స్పెక్టర్ వెంకటరెడ్డి సమాచారం మేరకు... భోలక్‌పూర్ డివిజన్ గుల్షన్‌నగర్‌కు చెందిన ఇద్దరు వ్యక్తులు స్క్రాప్ లేబర్‌గా పని చేస్తున్నారు. శుక్రవారం రాత్రి ఇద్దరు ఒకే దగ్గర నిలబడి మాట్లాడుకుంటుండగా వారిద్దరి మధ్య మాటామాటా పెరిగి ఘర్షణకు దారి తీసింది. దీంతో ముబషీర్ హుస్సేన్ అనే వ్యక్తిపై రియజ్ అహ్మద్(25) అనే వ్యక్తి తన దగ్గర ఉన్న పేపర్ కటింగ్ బ్లేడ్‌తో దాడి చేయగా అతనికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే అతన్ని చికిత్స నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న ముషీరాబాద్ పోలీసులు రియాజ్‌ను అదుపులోకి తీసుకొని అతనిపై 307 సెక్షన్ కింద కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

బాలుడి అదృశ్యం



మల్లికార్జున్

కాచిగూడ: ఓ బాలుడు అదృశ్యమైన ఘటన కాచిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్ఐ సుభాష్ సమాచారం మేరకు... కాచిగూడ రైల్వే స్టేషన్ వద్ద పోస్ట్ ఆఫీస్ సమీపంలో సంతోష్ కుమార్ కుమారుడు శ్రీమంత ఆకాష్ మల్లికార్జున్(13) అదృశ్యమయ్యాడు. మల్లికార్జున్ ఐదవ తరగతి చదువుతున్నాడు. కాచిగూడ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

2,97,666 @ ఖైరతాబాద్ ఓటర్లు

బంజారాహిల్స్: త్వరలో జరగనున్న పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఖైరతాబాద్ నియోజకవర్గం ఓటరు డ్రాఫ్ట్ నోటిఫికేషన్‌ను శనివారం జీహెచ్ఎంసీ సర్కిల్-18 డీఎంసీ ప్రశాంతి ఖైరతాబాద్‌లోని తన కార్యాలయంలో విడుదల చేశారు. ఈ డ్రాఫ్ట్ నోటిఫికేషన్‌పై అభ్యంతరాలు ఉంటే ఈ నెల 22లోగా తెలియజేయాలని సూచించారు. తాజాగా విడుదలైన డ్రాఫ్ట్ నోటిఫికేషన్ ప్రకారం ఖైరతాబాద్ నియోజకవర్గంలో మొత్తం ఓటర్ల సంఖ్య 2,97,666గా నమోదైంది. ఇందులో పురుషులు 154772 కాగా మహిళలు 142858, థర్డ్ జెండర్ 36 మంది ఉన్నారు. 50 శాతం మంది పురుష ఓటర్లు కాగా, 47.99 శాతం మహిళా ఓటర్లు ఉన్నారు.

అర్హులందరికీ 'ఆరు గ్యారంటీ'ల్లో లబ్ధి



దరఖాస్తులను అందజేస్తున్న మాజీ ఎంపీ వీహెచ్, రోహిణ్‌రెడ్డి

అంబర్‌పేట్: అర్హులైన ప్రతి ఒక్కరికీ కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన ఆరు గ్యారంటీల పథకాల్లో లబ్ధి చేకూరుతుందని మాజీ ఎంపీ వి.హనుమంతరావు, కాంగ్రెస్ పార్టీ ఖైరతాబాద్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ సి.రోహిణ్‌రెడ్డి స్పష్టం చేశారు. శనివారం ప్రజాపాలన ముగింపు సందర్భంగా బాగ్ అంబర్‌పేట్‌లోని భరత్‌నగర్‌లో ఉన్న ప్రజాపాలన కేంద్రాన్ని వారు సందర్శించి దరఖాస్తుదారులతో మాట్లాడారు. అంతేకాకుండా అందిన దరఖాస్తులపై అధికారులతో ఆరా తీశారు. కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీల హామీలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా చొరవ తీసుకుంటామన్నారు. ప్రజాపాలన కార్యక్రమం విజయవంతం అయిందని వారు స్పష్టం చేశారు. విజయవంతం చేసిన అధికారులను అభినందించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఆర్.లక్ష్మణ్ యాదవ్, మోతె రోహిత్, శంబుల శ్రీకాంత్‌గౌడ్, మాజీ కార్పొరేటర్‌లు దిడ్డి రాంబబు, పులి జగన్, శంబుల ఉషాశ్రీ, గరిగంటి రమేశ్, శ్రీధర్‌గౌడ్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.


సేవా కార్యక్రమాల్లో యువత పాల్గొనాలి



దుప్పట్లను పంపిణీ చేస్తున్న గౌతంరావు

కాచిగూడ: సేవా కార్యక్రమాల్లో పాల్గొనేందుకు యువత ముందుకు రావాలని బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతంరావు పిలుపునిచ్చారు. గౌతంరావు జన్మదినం సందర్భంగా శనివారం బర్కత్‌పురాలో బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా కోశాధికారి ఎ.సూర్యప్రకాష్ సింగ్ ఆధ్వర్యంలో పార్టీ నేతలు మహిళలకు, వృద్ధులకు దుప్పట్లను పంపిణీ చేశారు. బీజేపీ యువమోర్చా కన్వీనర్ సునీల్ కుమార్ ఆధ్వర్యంలో గోల్నాక అంగన్‌వాడీ కేంద్రంలో పండ్లు పంపిణీ చేశారు. బీజేపీ ఓబీసీ మోర్చ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు సి.వినోద్ యాదవ్, సి.నందకిషోర్ యాదవ్, కేసరి నర్సింగ్ యాదవ్, రవీందర్, శ్రీధర్ చారి, సుధాకర్, మనోజ్, అచ్చిని రమేష్, ఎం.మురళి, ఎం.బి.కిషోర్ కుమార్, బి.రాజు, అనంతలక్ష్మీ, నాగభూషణ్ చారి, శిరీష, మహేష్ పాల్గొన్నారు.

పవర్ బోర్ల పనులు ప్రారంభం



ముషీరాబాద్‌లో పవర్ బోర్ పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ సుప్రియ

ముషీరాబాద్: కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి నిధులతో ప్రజల నీటి అవసరాలను తీర్చేందుకు రెండు పవర్ బోర్ల నిర్మాణ పనులు ప్రారంభించామని కార్పొరేటర్ సుప్రియనవీన్‌గౌడ్ పేర్కొన్నారు. శనివారం ముషీరాబాద్ డివిజన్‌లోని మొరంబొంద, నెయ్యియోళ్ల గల్లీలలో నూతనంగా ఏర్పాటు చేసేప పవర్‌బోరు నిర్మాణ పనులు కార్పొరేటర్ ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ... ఎన్నికల కోడ్ ఉన్నందున బోర్ ఏర్పాటులో జాప్యం జరిగిందన్నారు. బోర్‌లు వేసిన అనంతరం డ్రైనేజీ పైప్‌లైన్ల నిర్మాణ పనులు సైతం కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి నిధులతో ప్రాంభించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యులు పూస రాజు, ముషీరాబాద్ నియోజకవర్గ బీజేపీ జాయింట్ కన్వీనర్ ఎం.నవీన్‌గౌడ్, బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జమాల్‌పురి నందు, డివిజన్ అధ్యక్షులు బద్రినారాయణ, నాయకులు శ్రీహరి, వాసు, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

మంగళంపల్లి గానం నిత్య నూతనం

చిక్కడపల్లి: మంగళంపల్లి బాలమురళీకృష్ణ గానంలోని మాధుర్యం నిత్యనూతనమై శ్రోతలను రంజిప చేస్తుందని ప్రముఖ గాయకులు కొనియాడారు. శనివారం సాయంత్రం శ్రీ త్యాగరాయగానసభలోని కళాసుబ్బారావు కళా వేదికలో బుక్ రీడింగ్ అండ్ కల్చరల్ సొసైటీ, శ్రీ రాగ సినీ మ్యూజికల్ ఆర్కెస్ట్రా 25 సంవత్సరాల సందర్భంగా జరిగిన వేడుకల్లో గాయకుడు డీవీవీఎస్ నాయరాయణ సంకలనం చేసిన సంగీత స్వరనిధి బాలమురళి సంపుటిని ప్రముఖ గాయకుడు త్రినాథరావు, విశ్రాంత విద్యాధికారి పల్లా సోమసుందరశర్మ, అన్నమయ్య సంకీర్తనల పరిశోధకుడు నాగరాజులు అవిష్కరించారు. ఈ సందర్భంగా అణుశాస్త్రవేత్త విశ్వనాథ్ మద్దిపట్లను కళా వాచస్పతి బిరుదుతో, రక్షణ శాఖలో పదవీ విరమణ చేసిన అదినారాయణమూర్తిని జీవిత సాఫల్య పురస్కారంతో, గాయని వీఏ లక్ష్మీని గానసుధా రత్న బిరుదుతో. గాయకుడు నేదునూరి శ్యామ కృష్ణను గాన కళా భూషణ బిరుదులతో సంస్థ పక్షాన సత్కరించారు. సంస్థ కార్యదర్శి అలివేలు నివేదిక సమర్పించారు. అనంతరం లక్ష్మీ, శ్యామ కృష్ణ, శ్రీదేవి తదితరులు పాడిన పాటలు సభికులను ఆకట్టుకున్నాయి.

బీసీ జన గణనను వ్యతిరేకిస్తే సహించం

లిబర్టీ: అన్నింటా వెనుకబడి దయనీయ జీవితాలు వెళ్లదీస్తున్న బీసీల జనాభాను లెక్కించేందుకు కొన్ని పార్టీలు సంస్థలు వ్యతిరేకించడాన్ని బీసీ దళ్ జాతీయ అధ్యక్షుడు డి.కుమారస్వామి తీవ్రంగా ఖండించారు. బీసీ ఓట్లతో అధికారం వస్తున్న పార్టీలు ఆ సామాజికవర్గ జనగణన చేస్తే ఎందుకు అడ్డుకుంటున్నారని నిలదీశారు. జనగణన చేయని పక్షంలో మిషన్ 2024లో తగిన గుణపాఠం చెబుతామని ఆయన హెచ్చరించారు. బీసీ దళ్ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ... బీసీ జనగణనను బీజేపీ ఆర్ఎస్ఎస్ వంటి పార్టీలు సంస్థలు వ్యతిరేకిస్తున్నాయని ఆరోపించారు. బీసీ జన గణన చేయకూడదని ఆర్ఎస్ఎస్ ప్రకటించడానికి తీవ్రంగా నిరసించారు. దేశంలో, రాష్ట్రాలలో బీసీ జనాభా ఎంత ఉందో తెలుస్తుంది తప్ప జన గణన చేస్తే ఆర్ఎస్ఎస్‌కు కలిగే నష్టం ఏమిటని సూటిగా ప్రశ్నించారు. ఆర్ఎస్ఎస్‌కు చెందిన ప్రముఖ బీసీ జనగణన చేయకూడదని ప్రకటించడం అంటే అగ్రకుల ఫాసిస్టు శక్తుల వైఖరిని ఏమిటో అర్థం అవుతుందని వాఖ్యానించారు. బీసీ జనగణన చేస్తే వచ్చే నష్టం ఏమి ఉందని ఆయన నిలదీశారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్ స్వభావం బయటపడిందని ఆర్ఎస్ఎస్ చెప్పినట్టే కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వ్యవహరిస్తుందని బీసీ జన గణన కూడా చేయడం లేదని అన్నారు.

రేపు మున్నూరుకాపు భవన్‌లో సంక్రాంతి ముగ్గుల పోటీలు

కాచిగూడ: తెలంగాణ రాష్ట్ర మున్నూరుకాపు మహాసభ మహిళా కమిటి ఆధ్వర్యంలో ఈ నెల 8వ తేదీన కాచిగూడలోని మున్నూరుకాపు భవన్‌లో సంక్రాంతి ముగ్గుల పోటీలను నిర్వహించనున్నట్లు మహాసభ అధ్యక్షుడు, ట్రస్ట్‌బోర్డు మెంబర్ పిల్లి శ్రీనివాసరావు తెలిపారు. శనివారం కాచిగూడలోని మహాసభ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... మహాసభ, ట్రస్ట్ బోర్డు ల సంయుక్త ఆధ్వర్యంలో సంక్రాంతి వేడుకలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మహాసభ చరిత్రలో మొదటిసారిగా మహాసభ మహిళా కమిటీని ఏర్పాటు చేయడం జరిగిందని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో మహిళా కమిటీ కన్వీనర్ చామకూర సుజాత, మహిళా కమిటీ ఇంచార్జ్ అడ్వకేట్ అన్నపూర్ణ, కావేటి అజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయాలి



నల్లకుంట: డివిజన్ పరిధిలో కొనసాగుతున్న వివిధ అభివృద్ధి పనులను నిర్ణీత సమయంలో పూర్తి చేయించి ప్రజల వినియోగంలోకి తీసుకురావాలని నల్లకుంట కార్పొరేటర్ అమృత జీహెచ్ఎంసీ, వాటర్ వర్క్స్ అధికారులకు సూచించారు. బాయమ్మ గల్లీ, తిలక్ నగర్‌లలో కొనసాగుతున్న సీవరేజీ, రోడ్డు నిర్మాణ పనులను శనివారం సంబంధిత శాఖ అధికారులతో కలిసి కార్పొరేటర్ పర్యవేక్షించారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించేలా ఎప్పటికప్పుడు పనులను పర్యవేక్షిస్తుండాలని ఈ సందర్భంగా అధికారులకు సూచించారు. కార్యక్రమంలో వాటర్ వర్క్స్ శివం సెక్షన్ మేనేజర్ రోహిత్, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థుల వంటకాలు భళా



చెఫ్‌ల అవతారంలో నారాయణ పాఠశాల విద్యార్థులు

అంబర్‌పేట్: చిన్నారులు మాస్టర్ చెఫ్‌ల అవతారం ఎత్తారు. నోరూరించే విభిన్న ఆహార పదార్థాలను తయారు చేసి ఆకట్టుకున్నారు. శనివారం డీడీ కాలనీలోని నారాయణ ఈటెక్నో పాఠశాలలో మాస్టార్ చెఫ్ నారాయణ పేరిట ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించి విద్యార్థులు విభిన్న వంటకాలను తయారు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నారాయణ పాఠశాల జీఎం గోపాల్‌రెడ్డి, ఏజీఎం బాలపరమేశ్వర్‌రావులు హాజరై విద్యార్థులను అభినందించారు. ప్రిన్సిపాల్ టి.మౌని స్టాలిన్, కోఆర్డినేటర్‌లు మహేశ్వరి, లక్ష్మీభవాని, వైస్ ప్రిన్సిపాల్ సుజాత, ఏవో మల్లికార్జున్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్యుల ఐక్యతకు వాసవీ క్లబ్స్ కృషి



సమావేశంలో పాల్గొన్న రవిచంద్రన్

కాచిగూడ: ఆర్యవైశ్యుల ఐక్యతకు కృషి చేస్తున్నట్లు వాసవీ క్లబ్స్ ఇంటర్నేషనల్ అంతర్జాతీయ అధ్యక్షుడు రవిచంద్రన్ తెలిపారు. శనివారం కాచిగూడ, ఇసామియాబజార్‌కు చెందిన మ్యాడం సుధాకర్ వాసవీ క్లబ్స్ గ్రేటర్ హైదరాబాద్ 26వ అధ్యక్షులుగా ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. విద్య, వైద్యం, మహిళా సాధికారత కోసం వాసవీ క్లబ్ నిరంతరం పనిచేస్తుందని ఆయన పేర్కొన్నారు. రాజకీయంగా ఎదిగి తనదైన ముద్ర వేయడమే కాకుండా సామాజిక సేవలను నిరంతరం కొనసాగించాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గౌతమ్‌రావు జన్మదిన వేడుకలు



గౌతమ్‌రావును గజమాలతో సత్కరిస్తున్న బీజేపీ నేతలు

అంబర్‌పేట్: బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతమ్‌రావు జన్మదిన వేడుకలు సందడిగా జరిగాయి. శనివారం డీడీ కాలనీలోని ఆయన నివాసంలో పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. పూలదండలు, శాలువాలతో సత్కరించి అభిమానాన్ని చాటుకున్నారు. బీజేపీ నాయకులు చుక్క జగన్, గోవర్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పద్మశాలీకాలనీలో శ్రీరాముడి అక్షింతల పంపిణీ



అక్షింతలను పంపిణీ చేస్తున్న దృశ్యం

ముషీరాబాద్: భోలక్‌పూర్ పద్మశాలీ కాలనీలో అయోధ్య శ్రీరాముడి అక్షింతల ఊరేగింపు శనివారం కాలనీ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సొసైటీ ప్రధాన కార్యదర్శి ఆర్.ఆంజనేయులు శ్రీరాముడి అక్షింతలను ఇంటింటికీ అందజేసి అయోధ్య శ్రీరామ మందిరానికి పెద్ద ఎత్తున తరలివెళ్లాలని కోరారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు సుందర్‌పటాలే తదితరులు పాల్గొన్నారు.

ముదిరాజ్‌లను బీసీ-ఏలోకి మార్చాలి



మాట్లాడుతున్న శ్రీనుముదిరాజ్

పంజగుట్ట: ముదిరాజ్ కులస్తులను బీసీ డీ నుంచి బీసీ ఏలోకి మార్చాలని తెలంగాణ ముదిరాజ్ మహా వేదిక రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ గుండ్లపల్లి శ్రీను ముదిరాజ్ డిమాండ్ చేశారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఆయన కో కన్వీనర్ అల్లుడు జగన్ ముదిరాజ్‌తో కలిసి విలేకరులతో మాట్లాడుతూ... త్వరలో ఉద్యోగ నోటిఫికేషన్లు వెలువడనున్నందున ప్రభుత్వం ముదిరాజ్‌లను బీసీ ఏ లోకి మార్చాలని కోరారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో ముదిరాజ్‌ల జనాభా దామాషా ప్రకారం వారికి అన్ని రాజకీయ పార్టీలు సీట్లు ఇవ్వాలన్నారు. ముఖ్యంగా మహబూబ్‌నగర్, మెదక్, జహీరాబాద్, భువనగిరి స్థానాల్లో గెలుపు ఓటములు శాసించే స్థాయిలో ఉన్న ముదిరాజ్‌లకు సీట్లు ఇవ్వాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ నుంచి గెలిచిన ముదిరాజ్ సామాజికవర్గానికి చెందిన శ్రీహరి ముదిరాజ్‌కు మంత్రివర్గంలో స్థానం కల్పించాలన్నారు. నేతలు బొక్క శ్రీనివాస్, ఉప్పర వేణి రంజిత్ పాల్గొన్నారు.